


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పుస్తకాల పండగ.

**అసలు మొదటి పుస్తకం** చదివినది ఎప్పుడో మీకు గుర్తుందా? నాకైతే అ అంటే అమ్మ, ఆ అంటే ఆవూ అని చదివిన పుస్తకమే మొదటి పుస్తకం అనిపిస్తోంది. అమ్మ మా చిన్నప్పుడు అ ఆ ఇ ఈలున్న పటమొకటి తెచ్చి గోడకి తగిలించి, నేర్పిస్తుంటే ఈ తల్లకిందులుగా  వున్నాయి నేను రాయనని భీష్మించుకు కూర్చున్నానుట. నా పిల్లకి నాలుగు అక్షరపు ముక్కలు ఇక రావేమో! ఎలా రా భగవంతుడా? చాకలి పద్దు రాయడమైనా రావాలి కదా అని తెగ బెంగ పడిందిట.

కానీ ఆ తర్వాత నేను "బుజ్జి బుజ్జి మేక ఏడకెడితివీ ', 'కలవారి కోడలూ కలికి కామాక్షీ' , 'చిట్టీ చిలకమ్మా అమ్మా కొట్టిందా?' అని అన్నీ చకచకా అప్పచెప్పేసి, ఆ పైన అక్షరాలు దిద్దేసి, పలక మీద అన్నీ రాసి చూపించాక కొద్దిగా నిశ్చింత ఫీలయిందట. ఇక్కడ రెండు రాష్ట్రాలవాళ్ళకీ ఈ తెలుగు అక్షరాలు అక్షయంగా రాసి పంచుతానని ఆనాడు ఊహించలేదు పాపం.

నా పఠనాసక్తి పెరగడానికి ఒక కారణం మా అమ్మమ్మ అయితే, రెండు చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ, ఊహ వచ్చినప్పటినుండీ లైబ్రేరీకి వెళ్ళి పుస్తకాలు చదవడం అలవాటైంది. అంతెందుకు మా ఎం.బి. హైస్కూల్లో లైబ్రేరియన్‌కి అసలు పనిలేక నిద్రపోతూ వుండేవాడు. నేను వెళ్ళి నిద్రలేపి 'తేనె కళ్ళ పిల్ల ', 'స్నో వైట్,' 'అద్దె బోటులో కుక్క పిల్లతో సహా ముగ్గురం', 'గలివర్ ట్రావెల్స్', 'సింద్‌బాద్ సాహసయాత్రలూ', లాంటివి అక్కడ కూర్చుని కొన్నీ, ఇంటికి తెచ్చుకుని కొన్నీ బఠానీల్లా నమిలేసాక, పాపం ఇంక నేను తప్ప ఏవీ మిగలలేదమ్మా నువ్వు నవలడానికి..పొమ్మన్నాడు.

అమ్మమ్మ ఏమో శరత్ చంద్ర సాహిత్యం నాకు మొదటిసారి పరిచయం చేసింది. ఆ పిచ్చిలో పడిననేను ఇంకనూ తేరుకొనలేదు.

రాముని బుద్ధిమంత తనం నవలలో గణేశుడూ, సారంగుడూ అనే రెండు చేపల్లో ఒక దాన్ని నారాయణి అనే రాముడి వదినగారి తల్లి రాసమణి మడితో పట్టి, వండుకుని తిని ఉపవాసం విడిచి పెడదాం ఏకాదశి తెల్లారి అని వెళితే, రాముడు నా పెంపుడు చేపలని ఎలా వండుకు తింటావని కిందపడి పొర్లి పొర్లి ఏడవడం చదివి నాకూ ఏడుపొచ్చింది.

ఏకాదశి ఉపవాసం వుంటే చేపలు తినాలా? మనింట్లో ఎందుకు వండరు? అంటే అమ్మమ్మ "బెంగాలీ బ్రాహ్మలు తింటారమ్మా మనం కాదు" అంటే ఎందుకిన్ని బేధాలూ?" అనిపించేది. అసలు శరత్ చంద్ర ఏదైనా రాస్తే, ఆ ఆచారం, ఆ అలవాటూ ప్రపంచం అంతా పాటించాలి అనిపించేది. 'అరుణ్ దా ', 'గుణేంద్ర దా', 'దేవదా' అని పిలుస్తూ వుంటే, నేనూ మా అన్నయ్యని 'శ్రీకాంత్ దా' అని పిలిచేదాన్ని. అసలు శ్రీకాంత్ అనే పేరు మా అన్నయ్యకి 'శ్రీకాంత్' నవల చదివే పెట్టారట మా నాన్న.

"కుండలో రసగుల్లాలు ఆకులో పెట్టిస్తా తిను మరిదీ, తిని పాలు తాగు" అని చరిత్ర హీనుల్లో కిరణ్ మయి అంటే రసగుల్లాలు తినాలి అని పేచీ పెట్టేదాన్ని.

ఆ తరువాత తెలుగు వాచకంలో కానీ, నాన్‌డిటైల్‌లో కానీ మంచి కథలుండేవి. నాకు ఒకటో క్లాసులో కలర్‌లో వున్న బొమ్మలో 'బాలగంగాధర్ తిలక్ ', లాంటి లెసన్స్ ఇప్పటికీ కళ్ళల్లో కదలాడతాయి. ఆ తరువాత చదివే అలవాటు అలవరచడంలో చందమామది పెద్ద చెయ్యి. ఒకటో తారీఖు తర్వాత అమ్మ చందమామ ఎప్పుడు కొని తెస్తుందా అని ఎదురు చూసేదాన్ని. తరువాత తరువాత స్నేహితులమంతా 'నువ్వు బొమ్మరిల్లు కొనమను ఇంట్లో వాళ్ళని, నువ్వు బాలమిత్ర కొనమను, మనం చదివాక మార్చుకుందాం" అనే ఒప్పందానికొచ్చి అన్నీ చదివేవాళ్ళం.

చివరకి ఆడుకోడానికి 'షూ' కొంటే ఇచ్చే 'పరమ పద శోపాన పటం' అంటే వైకుంఠపాళీ, ఇప్పటి తరానికి స్నేక్ అండ్ లాడర్స్ కూడా ఎంత చదువు నేర్పేదంటే ఒకటి, రెండూ, మూడు గళ్ళలో గవ్వలు తిప్పుతుంటే, సప్తరుషుల పేర్లూ, దేవలోకం, పాతాళలోకం, నాగలోకం, ఇలా మనలో ఆ గళ్ళలో వున్న బొమ్మలతో జిజ్ఞాస పుట్టించేదిగా వుండేవి.

అమ్మా, పెద్దమ్మలూ దీపావళి యువా, జ్యోతి కోసం ఏడాదికొకసారి పెద్ద పండగలా ఎదురు చూసి కొనేవాళ్ళు 'ఆ లావూ, అందులో వ.పా అంటే వడ్డాది పాపయ్యగారి బొమ్మలకే కడుపు నిండిపోయేది.

ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే ప్రతి ఏడులాగే హైదరాబాద్‌లోని ఎన్.టి.ఆర్ గార్డెన్స్‌లో ఈ ఏడు కూడా పుస్తకాల పండగ అంటే బుక్‌ఫేర్ పెట్టారు. మా అదృష్టం కొద్దీ, మా స్నేహితులం కిరణ్‌ప్రభగారు, కాంతి కిరణ్ దంపతులూ, మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు పద్మజ దంపతులూ, అందరం హైదరాబాద్‌లో వుండడం మూలాన పొద్దుట లంచ్‌కి క్షేత్రాలో కలిసి, తర్వాత బుక్ ఫేర్‌కి వెళ్ళాలని నిశ్చయించుకున్నాం.



మేం రేపు కలుస్తాం అనగానే కాంతిగారికీ, నాకూ, పద్మజకీ ఎందుకో ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళే స్కూల్ పిల్లల్లా ఉత్సాహంగా వుంటుంది. అందరికన్నా ఆలశ్యంగా నేనే వెళ్ళాను. అప్పటికే కిరణ్‌ప్రభగారు చాట్ జీపీటీ, నోట్ బుక్ ఎల్ ఎమ్మనే ఏప్‌లు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి ఎలా పని చేస్తాయో, పద్మజకీ మల్లాదిగారికీ బోధిస్తున్నారు. నేనూ వెళ్ళి తరగతిలో విద్యార్థినిలా కూర్చుని నాకూ చెప్పమన్నాను. ఆయన సహనానికి పెద్దన్నగారు కదా! మళ్ళీ 'రెడ్డొచ్చె మొదలాడె' సామెతలా మొదటి నుండి చెప్పుకొచ్చారు. నన్ను చూడగానే మల్లాదిగారు ర్యాగింగ్ స్టార్ట్ చేస్తారుగా!



"మీరైతే చాట్ జీపీటీ ని కథలెలా రాస్తారో కూడా అడిగి నేర్చుకోవాలి" అన్నారు.

ఆర్డర్ ఇవ్వడానికి అందరం డిసైడ్ అవుతుంటే మళ్ళీ "నేనే బిల్ పే చేస్తున్నా మొహమాట పడకుండా ఆర్డర్ చెయ్యచ్చు మీరు" అన్నారు మల్లాదిగారు. ఆయన అలా ఆట పట్టించడం నాకు చాలా ఇష్టం. అందుకే మొహమాట పడకుండారెండు 'మూల్ బగల్ దోశలు, ఒక దాని తర్వాత ఒకటి ఆర్డర్ ఇచ్చేసా, అందరం ఇడ్లీ, నూడిల్స్, ఫ్రైడ్ రైస్‌లాంటివి ఆర్డర్ ఇచ్చాక, అన్నీ పంచుకుని తింటూ, కబుర్లు ఎక్కువగా నంజుకున్నాం. మా కబుర్లలో రకరకాల పుస్తకాలూ, రచనలూ, రచయితలూ, ఇప్పుడొస్తున్న పుస్తకాలూ, రచనా విధానం అన్నీ దొర్లాయి.



ఆ తరవాత మేం ఫోటోల కార్యక్రమం మొదలుపెడితే ఫోటోగ్రాఫర్‌గా మల్లాదిగారు స్వచ్ఛందంగా ముందుకొస్తారు. ఎటూ ఆయన ఫోటోల్లో వుండరు కాబట్టి. ఫోటోలు తీసుకునేటప్పుడు 'నేను అంత బాగోలేను' అని పద్మజ, కొత్త విషయాలూ చెపితే 'మా ఆయన ఇంకా చెప్పలేదు కదా నాకు తెలియదు' అని మా కాంతిగారు జంట స్వరాలు పాడుతూనే ఉన్నారు.



ఫోటోలయ్యాక, కాంతిగారూ వాళ్ళొచ్చిన కారులో అంతా మగవాళ్ళూ, మా కార్లో మేం ముగ్గురం ఆడవాళ్లం కూర్చుని బుక్‌ఫేర్‌కి వెళ్ళాం. మా రథచోదకుడు కుమార్‌కి పద్మజ ప్రతిసారీ రూట్స్ చెప్పినా బుర్రకెక్కదు. మొత్తానికి గేట్ దగ్గర దింపాడు. అల్లు అర్జున్ ఏక్ట్ చేసిన సినిమాకొచ్చామా? అన్నట్లు పెద్దక్యూ. జనం క్యూలో నిలబడి అలా పుస్తకాల ప్రదర్శన చూడడానికి వెళ్ళడం, నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

మాకు వెళ్ళగానే లైన్‌లో వేమూరి సత్యనారాయణగారు కనిపించారు. గుడ్ ఓల్డెన్ డేస్ గుర్తుచేసుకున్నాం. మల్లాదిగారు సత్యనారాయణగారి అమ్మగారు చేసిన టమాటా పచ్చడి వాళ్ళింటికి భోజనానికి వెళ్ళినప్పుడు తనకెంతో నచ్చిందని గుర్తు చేసుకున్నారు.

మా చేతిలో పద్మజా వాళ్ళ పబ్లిషర్ ఇచ్చిన పాస్‌లు వుండడంతో, నేను మనం 'క్యూ'లో వెళ్ళడం ఏంటి అని 'అవుట్' అని రాసున్న గేట్‌లోకి వెళ్ళి "నాతో పెద్ద పెద్ద రైటర్స్ వున్నారు... మమ్మల్ని కాస్త వదిలిపెట్టు నాయనా " అని ఆ గేట్ కీపర్‌ని అడిగేసరికి, సరస్వతీదేవి బంటులా వున్న అతను మమ్మల్ని వదిలేసాడు. అలా రూల్స్ బ్రేక్ చేస్తూ నిర్విఘ్నంగా బుక్‌ఫేర్‌లోకి అడుగు పెట్టాం.



ఒక్కొక్క షాప్ దగ్గరా ఆగి వాటిని చూస్తూ, వ్యాఖ్యానాలు చేస్తు, మేం మా జోక్‌లకి నవ్వుతూ చాలా ఎంజాయ్ చేసాం. నాకు రెండు పుస్తకాలు బ్యాగ్‌లో పడేసరికి అర్ధమయింది. పుస్తకాలు మోసుకుంటూ నేను నడవలేను, నా బ్యాక్‌ఏక్ వలన అని. అప్పుడే సరిగ్గా నడుముకి బెల్ట్ పెట్టుకుని వంగిపోయిన ఒక ఎనభై ఏళ్ళుపై బడ్డ వృద్ధురాలూ, ఆవిడ భర్తా పార్వతీ పరమేశ్వరులు సరదాగా అలా షైర్ కొచ్చినట్లు, సంచి నిండా పుస్తకాలు మోసుకుంటూ వస్తూ కనపడ్డారు. నాకు చాలా సిగ్గేసింది.

కిరణ్ ప్రభగారిని చూసి ఫోటోలకి ఎగబడేవాళ్ళూ, మల్లాదిగారు మల్లాదిగారే అని తెలిసాక, ఆనందంతో మైమరిచిపోయే వాళ్ళూ తగిలారు. మల్లాదిగారు కనిపించగానే చిన్నప్పటినుండీ ఆయన రచనలు చదువుతూ, ఆయన సిద్ధాంతం గురించి తెలిసిన వాళ్ళు కూడా కనిపించగానే ఫోటోలు అడగడం నాకు ఆశ్చర్యమనిపిస్తుంది.

ఒక పెద్దావిడ నా పక్కనుండే రెండుసార్లు రాసుకుంటూ వెళ్తూ "రమణీగారు కనిపించారుట మా కోడలికి .. ఎక్కడున్నారో" అని వెళ్ళిపోయారు. మూడోసారి నేనే ఆపి "అమ్మా నేనే రమణీని" అన్నాను. ఆవిడ పేరు విజయలక్ష్మిగారు. కిరణ్‌ప్రభగారిని కూడా చూసి చాలా సంతోషించారు.



నేను యువరాణి అనే పేరుకల యువ వయస్కురాలైన అమ్మాయి రాసిన కవితల బుక్ కొన్నాను ఎంకరేజ్ చేద్దాం అని. తర్వాత గోదావరీ పబ్లిషర్స్ షాప్‌లో మొత్తం మల్లాదిగారి పుస్తకాలే కనపడడంతో పద్మజతో నేను"మనకి కావలసినాయన పుస్తకాలు కదా ఇక్కడ ఫోటో తీసుకుందాం" అని ఫోటో తీసుకున్నాం.

తెలిసినవాళ్ళు చాలామంది కనిపించారు. విప్లవ్, శ్రీకాంత్ అనే రచయిత తన స్టాల్‌లో, వాసిరెడ్డి నవీన్‌గారూ, స్వాతీ శ్రీపాదా, నారదభట్ల అరుణా, నా ఎఫ్ బి ఫ్రెండ్స్ లలితా వర్మ, ఇందిరా రావుగార్లూ, రాధా ఒడూరీ, పాలపర్తి సంధ్యారాణీ, వాళ్ళ అమ్మమ్మగారు కనుపర్తి వరలక్ష్మమ్మగారి మీద కిరణ్‌ప్రభగారు టాక్ షో కూడా చేసారు. నా ఇంటర్ మీడియట్ ఫ్రెండ్ 'జ్ఞానసిరి' ఇంక లేఖినీ స్టాల్‌లో అత్తలూరి విజయగారి బృందం.. రమా రావి, ఆవిడ స్నేహితురాలు శ్యామలగారూ, పుస్తకాల షాపుల్లో ఆటోగ్రాఫ్‌లిస్తున్న యువ రచయితలు అనబడే ఒకటో రెండో రాసిన వాళ్ళూ, ఇలా కొందరితో ఫోటోలు కూడా దిగాం.

సరసిగారి కార్టూన్ గుర్తు చేసారు కిరణ్‌ప్రభగారు "బౌన్సర్‌లని పెట్టుకుంటే కానీ ప్రముఖులనుకోరు" అన్నది. కానీ మేం బౌన్సర్లని పెట్టుకోకపోయినా కొందరు గుర్తుపట్టారు శభాష్ అని వీపుమీద తట్టుకున్నాం. ఆ రోజు క్రిస్మస్ శెలవు. అందుకని వేలం వెర్రిగా వచ్చేసారు పెద్దా చిన్నా. వీళ్ళంతా కొంటారా? కొంటే ఈ పుస్తకాల షాప్‌లవాళ్ళు బాగుపడ్తారు అని నేనంటే, మా కాంతిగారు "బయట బజ్జీల కొట్ల వాళ్ళు మాత్రం బాగుపడ్తారు" అని షార్ప్‌గా బాణంవదిలారు. నిజంగా వచ్చిన వాళ్ళంతా బుక్స్ కొంటే, పుస్తకాలకి మంచి రోజులొచ్చినట్టే.



నన్ను ఇదివరకు చూసినప్పుడు "మీరు బాగా లావయిపోయారు సుమా" అన్న వాళ్ళు ఈసారి "మీరేమీటి ఇలా చిక్కిపోయారూ? ఏం బాగాలేరు" అన్నారు. నాకు అర్ధమైందేవిటంటే ఎలా వున్నా జనానికి అనడానికి ఏదో ఒకటి దొరుకుతుంది... సీరియస్‌గా తీసుకోకూడదని.

చివరాఖరిగా మా ఎమెస్కో సాహితీ స్టాల్‌కి వెళ్ళాము. అక్కడ శివ అనే అబ్బాయి నన్ను చూసి కింద కట్టలుగా వున్న నా పుస్తకాలు డిస్‌ప్లేలో పెడ్తూ కనిపించాడు. ఎందుకో పట్టాభిరాంగారంటే వున్న ప్రేమ లేడీ రైటర్స్ మీద వుండదు. ఆయన ఫోటోలు షాప్ మొత్తం డిస్‌ప్లే లో వుంటాయి. మహానుభావులు ఈ మధ్యే

మనకి దూరం అయ్యారు.

నేను రీప్రింట్ వచ్చిన 'ఆ ఒక్కటీ అడిగేసెయ్' బుక్ పట్టుకుని నిలబడితే మా కాంతిగారు ఫోటోలు తీసారు. ఈ రోజు పోస్ట్‌లో పది కాపీలు పంపింది  ఎమెస్కో లక్ష్మి.

గేట్ బయటకి వచ్చేసాక పద్మజ "కాఫీ తాగి వెళ్ళండి" అని ఆహ్వానించారు. నా మనసంతా ఒకటే పీకేసింది కానీ దేవుడికి ఒక్క మొక్కు కోసం వదిలేసా.అసలే పెద్దాయనతో వ్యవహారం...సాయిబాబాతో అని" ఇంటి దగ్గర దింపుతా కానీ లోపలికి రాలేను" అన్నాను.

కిరణ్ ప్రభగారు కూడా ఆలశ్యం అయింది ట్రాఫిక్ పెరిగిపోతోంది వెళ్ళిపోతాం అన్నారు.

అప్పుడు ఉషా ప్రత్యూష అనే బాల పబ్లిషర్స్ అమ్మాయి "మేడం లోపలే వున్నారా" అని ఫోన్ చేసింది. ఇంక ఓపిక లేదు, రేపు ఇంటికి రామ్మా" అన్నాను. ఆ అమ్మాయి అన్నప్రకారం పొద్దుటే వచ్చి బోలెడు కబుర్లు చెప్పి సాయంత్రం దాకా గడిపి "ఒక రొమేంటిక్ నవల రాసి పెట్టి నన్ను నిలబెట్టండమ్మా పబ్లిషర్‌గా" అని చేతిలో చెయ్యి వేయించి మాట తీసుకుని వెళ్ళింది.

మా స్నేహితులకి మాత్రం వదలలేక వదలలేక వీడ్కోలు ఇచ్చుకోడం కష్టంగా వుంటుంది ప్రతిసారీ. మళ్ళీ మూడు కుటుంబాలం ఎక్కడ కలుస్తామో.. ఇక్కడో, అమెరికాలోనో,.

పద్మజ వియత్నాం నుండి, కాంతిగారు రివాజుగా ప్రతిసారిలా బహుమతులిచ్చారు. నేను అయోధ్య రాముడ్ని ఇచ్చాను. అలా ముగిసింది మా పుస్తకాల ప్రదర్శనశాల యాత్ర.

"ఆవిడ ఎగ్జిబిషన్ అంటే చూసి ఆనందించాలి, కొనకూడదు అనుకుంటున్నారని" చివరిగా మల్లాదిగారు నామీద వేసిన జోక్ కి ఇప్పటికీ నవ్వుకుంటూనే ఉన్నాను.

Post your comments

